మరో ఇద్దరు రైతులు బలి

- అప్పులు తీర్చే మార్గం లేక బలవన్మరణం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో కరెంట్ షాక్‌తో ఇంకో రైతు మృతి

పరమేశ్‌గౌడ్, తలారి బాలమణి (ఫైల్)

కొండపాక (కుకునూరుపల్లి)/శివ్వంపేట, ఏప్రిల్ 13 : నీళ్లు లేక వేసిన పంటలు ఎండి పోయి.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు రైతులు పురుగు మందు తాగి తనువుచాలించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సిద్ది పేట జిల్లా కుకునూరుపల్లికి చెందిన పాల పర మేశ్‌గౌడ్ (32) బ్యాంకుతోపాటు బయట అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. తన వ్యవసాయ భూమితోపాటు తమ్ముడి పొలం లో వరి వేశాడు. పంట చేతికొచ్చిన తర్వాత కొంతవరకు అప్పులు తీరుతాయనుకున్నాడు. పంట సరిగ్గా పండకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో పరమేశ్‌కు బ్యాం కు అధికారులు ఇంటి రుణం కట్టాలని ఒత్తిడి తెచ్చారు. మనోవేదనకు గురైన ఆయన ఈనెల 7న వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. భార్య, పిల్లలను చివరి సరిగా చూద్దామని ఇంటికి చేరుకున్న పరమేశ్ వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు పురుగుల మందు తాగి నట్టు గుర్తించడంతోపాటు పరిస్థితి విషమంగా ఉన్నదని మెరుగైన వైద్యం కోసం పెద్ద దవాఖా నకు తరలించాలని సూచించారు. అక్కడి నుం చి ములుగులోని ఆర్‌వీఎం దవాఖానలో చేర్పించగా చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. బాధిత రైతు కుటుం బాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

శివ్వంపేటలో కౌలు రైతు..

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొంతా న్‌పల్లికి చెందిన తలారి బాలమణి (43) భర్తతో కలిసి తమకున్న రెండు ఎకరాలతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నారు. ఆరు ఎకరాల పొలంలో రెండు బోర్లు ఉన్నా భూగర్భ జలాలు అడుగం టడంతో నీరు రాక పంట ఎండిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయి ఈనెల 8న పురుగుల మందు తాగింది. గమనించిన కుమారుడు వెంటనే ములుగులోకి ఆర్‌వీఎం దవాఖానకు తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. బాలమణి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు శివ్వంపేట ఎస్సై మహిపా ల్‌రెడ్డి తెలిపారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

బాలయ్య (ఫైల్)

కొల్లాపూర్, ఏప్రిల్ 13 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. కొల్లా పూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన రైతు కుందేళ్ల బాలయ్య (70) తనకు ఎర్రగట్టు పెద్దవాగు వద్ద ఉన్న పొలంలో మూడేండ్లుగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. శని వారం తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన క్రమంలో మోటర్ ఆన్ చేశాడు. నీటిని మళ్లించే క్రమంలో పైపులు జాయింట్ ఊడిపోయాయి. దీంతో మోటర్ ఆఫ్ చేసేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అతడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రైతుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూర్‌లో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌తో మాట్లాడుతున్న రైతు రాజేశం

వడ్లకు 500 బోనస్ ఎప్పుడిత్తరు?

- వరి కోసి వారమైంది.. ఎప్పుడు కొంటరు?
- కాంగ్రెసోళ్లకు పాలన చేతకాదు
- పదేండ్లల్ల రాని కరువు నాలుగు నెలల్లోనే తెచ్చిన్రు
- ఆరు గ్యారంటీలకు ఎగనామం పెట్టిన్రు
- ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయద్దని అనుకుంటున్నం
- మాజీ ఎమ్మెల్యే సుంకెతో పూడూరు రైతు రాజేశం ఆవేదన

కొడిమ్యాల, ఏప్రిల్ 13: 'కాంగ్రెసోళ్లు ఎన్ని కల ముందు బాగ మాట్లాడిన్రు. అది చేత్తం.. ఇది చేత్తం అన్నరు. గెలిచేదాక ఓ మాట.. గెలి చిన తర్వాత ఇంకోటి అంటున్నరు. క్వింటాల్ వడ్ల మీద ఇస్తానన్న రూ.500 బోనస్ ఏమైంది? ఎప్పుడిత్తరో చెప్పాలి. నేను వరికోసి ఎనిమిది రోజులైతంది. ఎప్పుడు కొంటరు? ఊళ్లనే కొనుగోలు కేంద్రం చాల్ చేసిన్రు గానీ, ఎప్పటిసంది కొంటరో చెప్పలే. ధాన్యాన్ని దళా రులకు అమ్మద్దని సీఎం రేవంత్ అంటున్నడు. మరి ఏం చేయాలో అర్థమైతలేదు. రెండ్రోజుల సంది చాలా భయమైతాంది. మబ్బులు పడు తున్నయి. వానొస్తే వడ్లన్నీ నానుడే. గిట్లయితే మేం బతుకుడు కష్టమే' అని కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన రైతు రాజేశం వాపోయాడు. శనివారం గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ధాన్యం రాశులను పరిశీలించేందుకు వచ్చిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో రైతు తన ఆవే దన వ్యక్తం చేశాడు. రైతు మాటల్లోనే.. 'కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడే మాకు మంచిగుండె. గతంలో ఎన్టీఆర్ మాదిరిగా కేసీఆర్ మస్తు అభి వృద్ధి చేసిండు. ప్రతి పంటకు పుష్కలంగా నీళ్లు ఇచ్చిండు. ఇప్పుడు చుక్క నీళ్లు వస్తలేవు. కాంగ్రెసోళ్లకు పాలన చేయరాదు. పదేండ్లల్ల ఎన్నడూ చూడని కరువు తెచ్చిన్రు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని బద్నాం చేస్తున్నారే తప్ప రైతుల పంటలకు నీళ్లు ఇచ్చే సంగతి చెబుత లేరు. రూ.2 లక్షల రుణమాఫీకి దిక్కులేదు. ఆరు గ్యారంటీలు అని చెప్పి మోసం చేసిన్రు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మిగిలినయి పక్కకు పెట్టిన్రు. ఈ ఎంపీ ఎన్ని కల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని మా రైతులు, ప్రజలు నిర్ణయించుకున్నరు' అని బాధప డుతూ చెప్పాడు. సుంకె రవిశంకర్ స్పందిస్తూ రైతుల తరపున కేసీఆర్‌తోపాటు తామంతా కొట్లాడతామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

రెండు రోజుల్లోనే ధాన్యం డబ్బులు

- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి
- ఇప్పటికే 6,919 కేంద్రాల ఏర్పాటు
- అన్నీ సరిగా ఉంటేనే మద్దతు ధర
- నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లపై చర్యలు
- సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహాన్

పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): రైతులకు ధాన్యం డబ్బులను రెండు రోజుల్లోనే చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నట్టు పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, రైతు లకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. 7,149 కేంద్రా లకు గానూ ఇప్పటికే 6,919 కేంద్రాలను ప్రారం భించి 1.87 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, ఏర్పా ట్లపై శనివారం ఆయన సివిల్‌సప్లై భవన్‌లో విలేక రులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం తీసు కొచ్చిన ధాన్యానికి కచ్చితంగా మద్దతు ధర దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు పచ్చి ధాన్యాన్ని తీసుకురాకుండా ఆరబెట్టి, తూర్పారబట్టి 17 శాతం తేమ మించకుండా తీసుకురావాలని కోరారు. కొనుగోలు కేంద్రాల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జూన్ 30 వరకు కొనుగోలు కేంద్రాలు ఉంటాయని వివరిం చారు. కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లుల్లో తాలు, తేమ పేరుతో కోతలు పెడితే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రంలో ఎంత తూకం వేస్తే అంతే మొత్తం ట్రక్ షీట్‌లో ఉండాలని, మిల్లుల వద్ద కోత పెట్టొద్దని ఆదేశించారు. ఇలాంటి వాటిని నియంత్రించేం దుకు ఇప్పటికే ఐకేపీ కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాను కూడా స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని, సమస్యలను పరిష్కరిస్తా నని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసర మైన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లు వంటి పరికరాలను అందుబాటులో ఉంచి నట్టు వివరించారు. గన్నీ సంచులకు ఎలాంటి కొరత లేదని చెప్పారు.

56 చెక్‌పోస్టుల ఏర్పాటు

ఇతర రాష్ట్రాల ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా, ఇక్కడి బియ్యం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా అడ్డుకునేందుకు 56 చెక్‌పో స్టులు ఏర్పాటు చేసినట్టు డీఎస్ చౌహాన్ తెలిపారు. డిఫాల్ట్ మిల్లర్ల నుంచి డబ్బును రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నట్టు పేర్కొన్నారు. మిల్లింగ్ ఇండస్ట్రీ కూడా ఇబ్బందుల్లో ఉందని, వారి సమ స్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వారికి అందాల్సిన రూ. 900 కోట్ల ట్రాన్స్‌పోర్ట్ బకాయిలను విడు దల చేసినట్టు పేర్కొన్నారు. 90 శాతం మిల్లర్లు నిబంధనల ప్రకారం ఉండగా, మిగి లిన మిల్లర్లు అవకతవకలకు పాల్పడుతు న్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మంచిగా ఉండే మిల్లర్లకు సహకరిస్తామని, నిబంధనలు అతిక్రమించే మిల్లర్లపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఈ సీజన్‌లో మొత్తం 75 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 5 లక్షల ఎక రాల్లో వరిసాగు తగ్గడం, కొంత పంట నష్ట పోవడంతో ఆ లక్ష్యానికి తగ్గట్టు రాకపోవ చ్చని తెలిపారు.

రమణా లోడెత్తడం లేదురా!

మొదటిపేజీ తరువాయి...

ఆలోచనలో ఆయా సంస్థలు ఉన్నట్టు సమా చారం. ఇందుకోసం మిల్లర్లతో బేరసారాలు సాగిస్తు న్నట్టు తెలిసింది. ధాన్యం విక్రయించి ఆర్థిక లోటును పూడ్చుకుందామనుకున్న పౌరసరఫరాల సంస్థకు సంస్థల తీరుతో నిరాశే ఎదురవుతున్నది. ఇటు ధాన్యం ఎత్తక, అటు డబ్బులు రాక, మరోవైపు మిల్లుల్లో చోటు లేక పౌరసరఫరాల సంస్థ పరిస్థితి గందరగోళంగా మారింది. పౌరసరఫరాల సంస్థ 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్ర యించిన విషయం తెలిసిందే.

మిల్లుల్లోని ధాన్యం మాయం

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు బయట విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ విధంగా సుమారు 30–40 శాతం ధాన్యం మిల్లుల్లో లేదని పౌరసరఫరాల సంస్థ చేసిన తని ఖీల్లో బయటపడింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు సదరు మిల్లర్లు ఏ విధంగా ఆ ధాన్యాన్ని సమకూ ర్చుతారనేది చర్చనీయాంశంగా మారింది. కొత్త ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆ లోటును భర్తీ చేయాలని భావిస్తున్నా వ్యాపారులు మాత్రం అంగీకరించడం లేదని సమాచారం. ఇస్తే పాత ధాన్యమే ఇవ్వాలని, లేదంటే ఆ మేరకు డబ్బులు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది. ధాన్యం ఎత్తేందుకు ఇచ్చిన గడువు మరో 40 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో పౌరసరఫ రాల సంస్థ ఏం చేయబోతుందన్నది ఆసక్తిగా మారింది. గడువును పొడిగిస్తుందా? లేదంటే టెండర్లు రద్దు చేస్తుందా? అన్న చర్చ మొదలైంది.

పైసలు కట్టేదీ లేదు.. లోడెత్తేదీ లేదు

ఓ జిల్లాలో 1.75 లక్షల టన్నుల ధాన్యాన్ని టెండ ర్లలో ఓ సంస్థ దక్కించుకున్నది. ఇందులో 499 టన్నులను ఎత్తేందుకు మార్చి 15న ఆర్వో(రిలీజ్ ఆర్డర్) తీసుకున్నది. ఇందుకోసం సుమారు రూ. కోటి చెల్లించింది. ఇప్పటికి నెల రోజులు దాటు తున్నా 100 టన్నులు మాత్రమే తరలించి ఊరు కుంది. దాదాపు ప్రతి జిల్లాలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా 35 లక్షల టన్నుల్లో 5 వేల టన్నులు మాత్రమే తరలించినట్టు తెలిసింది. 5 వేల టన్నుల తరలింపునకే అంత సమయం తీసుకుంటే మిగిలిన ధాన్యం తరలింపు ఎప్పుడు పూర్తవుతుం దన్న సందేశాలు నెలకొన్నాయి.

మిల్లర్లతో బేరసారాలు!

టెండర్లలో ధాన్యాన్ని దక్కించుకున్న సంస్థలు, వ్యాపారులు ఆ ధాన్యాన్ని ఎత్తకపోవడం వెనుక పెద్ద గూడుపుఠాణి నడుస్తున్నట్టు తెలిసింది. ధాన్యానికి బయట డిమాండ్ తగ్గడంతో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తే రవాణా ఖర్చులు మీదపడే అవ కాశం ఉందని, దీనిని తప్పించుకునేందుకు 'మాస్టర్ ప్లాన్' రచించినట్టు సమాచారం. లోడెత్తకుండానే 'పని' పూర్తిచేసేందుకు మిల్లర్లతో బేరసారాలు సాగి స్తున్నట్టు తెలిసింది. మిల్లర్ల వద్దనున్న ధాన్యాన్ని వారు ఉంచుకొని ఆ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేలా రాయబారాలు నడుపుతున్నట్టు సమాచారం.టెండ ర్లలో కొనుగోలు చేసిన ధరకు అదనంగా క్వింటా లకు రూ. 200–250 వరకు ఇస్తే సరిపోతుందని ప్రతిపాదన పెట్టినట్టు తెలిసింది. మిల్లర్లు రూ. 100 ఇచ్చేందుకు సిద్ధం కాగా, వ్యాపారులు మాత్రం అది సరిపోదని చెప్తున్నట్టు సమాచారం.

మిగిలింది 40 రోజులే

టెండర్లలో ధాన్యం దక్కించుకున్న సదరు సంస్థలు కన్ఫర్మేషన్ లెటర్ ఇచ్చిన నాటినుంచి 90 రోజుల్లో మొత్తం ధాన్యాన్ని ఎత్తేయాలని పౌరసరఫ రాల సంస్థ టెండర్ నిబంధనల్లో పేర్కొంది. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 23న ఆయా సంస్థ లకు టెండర్ కన్ఫర్మేషన్ లెటర్లు జారీచేసింది. ఈ లెక్కన ఇప్పటికే 50 రోజులు పూర్తయింది. ఇక మిగి లింది 40 రోజులే. ఈ నేపథ్యంలో మిగిలిన 40 రోజుల్లో 34.95 లక్షల టన్నులు ఏ విధంగా ఎత్తగ లుగుతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తాన్ని ఎత్తాలంటే 1.2 లక్షల లారీ లోడ్లు అవు తాయని చెప్తున్నారు.

తలలు పట్టుకుంటున్న వ్యాపారులు

ప్రస్తుత పరిస్థితులను చూస్తున్న వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. టెండర్ల సమయంలో వ్యాపారులు సగటున క్వింటాలుకు రూ. 2 వేల చొప్పున వెచ్చించారు. ఆ సమయంలో బహిరంగ మార్కెట్లో ధాన్యం ధర రూ. 2300 వరకు పలి కింది. ఆ తర్వాత కూడా అదే డిమాండ్ కొనసాగు తుందని వ్యాపారులు భావించారు. ఇప్పుడు కొత్త ధాన్యం రావడంతో డిమాండ్ తగ్గిపోయింది. గతంలో ధాన్యం అమ్ముకున్న మిల్లర్లు ఇప్పుడు కొత్త ధాన్యం కొనుగోలు చేసి ఆ లోటును భర్తీ చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారుల పరిస్థితి కుడి తిలో పడ్డ ఎలుకలా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సివిల్‌సప్లైకి పైసలు వచ్చేనా?

రూ. 2,060 మద్దతు ధరతో పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ లెక్కన 35 లక్షల టన్నుల ధాన్యానికి రూ. 7,125 కోట్లు వెచ్చించింది. దీనికి అదనంగా నిల్వ, తరలింపు ఇతర ఖర్చులు కలిపి క్వింటాలుకు రూ. 250 వరకు అయ్యాయి. ఈ నేపథ్యంలో సంస్థపై భారీగా ఆర్థిక భారం పడింది. ధాన్యాన్ని విక్రయిం చడం ద్వారా ఆ లోటును పూడ్చుకోవచ్చని భావిం చింది. వీటిని విక్రయించడం ద్వారా సుమారు రూ. 7 వేల కోట్లను సమకూర్చుకోవాలని భావిం చింది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ధాన్యం పైసలు సివిల్ సప్లైకి వస్తాయా? అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి.

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం దోమలెడ్గిక్యాంప్‌లో వడ్ల కుప్పల వద్ద నిలిచిన వరద నీరు

రైతును వెంటాడిన అకాల వర్షాలు

నిజామాబాద్ నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 13: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్ర వారం రాత్రి నుంచి కురుస్తున్న వానలు రైతాంగా న్ని ఆగం చేస్తున్నాయి. కోటగిరి, వర్ని, చందూరు, రుద్రూరు, రెంజల్, బోధన్, ఆర్మూర్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, కమ్మర్‌పల్లి తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఇటీవల కురి సిన వడగండ్లతో కుదేలైన తరుణంలో వరుణుడు మరోసారి ప్రతాపం చూపిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. కోతకొచ్చిన పైర్లు నేలవాలాయి.

పంటలు ఎండిపాయె.. కొడుకు దూరమాయె!

- వయస్సు చిన్నదైనా.. బాధ్యత నెత్తికెత్తుకొని..
- సాగుభారం మోయలేక మనోవేదనతో యువరైతు బలవన్మరణం
- ఆధారం కోల్పోయిన రైతు కుటుంబం

యువ రైతు శశికుమార్ ఫ్లెక్సీని చూపిస్తున్న కుటుంబ సభ్యులు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (నమస్తేతెలం గాణ): ఒక కొడుకు, ఒక కూతురు.. ఉన్నంతలో సం పాదన. వ్యవసాయమే జీవనాధారం. ఇలా రోజులు గడుపుతున్న ఆ తండ్రి.. ముందు బిడ్డ పెండ్లి చేస్తే బాధ్యత తీరిపోతుందనుకున్నాడు. అనుకున్నట్లుగానే మంచి సంబంధం చూసి బిడ్డను ఓ అయ్య చేతిలో పెట్టాడు. కూతురు తన భర్త పిల్లలతో సంతోషంగా ఉంటుంది. కొంతకాలం ఆగి కొడుకు పెండ్లిజేత్తామని అనుకున్నాడు. కుటుంబ బాధ్యతను కొడుకుకు అప్ప గించాడు. చదువుకున్న కొడుకు సాగులో సాయపడితే మంచి దిగుబడి ఉంటుందని భావించాడు. కొడు కుతో కలిసి తల్లిదండ్రులు వ్యవసాయంలో రెక్కలుముక్కలు చేసుకున్నారు. కొడుకు ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూనే.. వచ్చిన జీతాన్ని కూడా పెట్టు బడికే పెట్టిండు. ఉన్న మూడెకరాలతో పాటు మరో 8 ఎకరాలు కౌలు తీసుకున్నారు. పంట గట్టిగ పండితే ఉన్న అప్పులన్నీ తీరుతాయనుకున్నరు. కానీ లెక్క తప్పింది. దిగుబడి పోయింది. అప్పులు మిగిలాయి. కుప్పగా పేరుకుపోయిన అప్పులు చివరికి కొడుకునే మింగేశాయి. ఆధారం అయితడనుకున్న కొడుకు దూరం కావడంతో కుటుంబమే ఆగమైపోయింది.

ప్రైవేటు అప్పులు 3 లక్షలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం యానంబైలు గ్రామానికి చెందిన మంత్రి శంకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వార సత్వంగా వచ్చిన ఉమ్మడి ఆస్తి మూడెకరాలు ఉంది. ఇది కూడా మంత్రి శంకర్ చిన్నాన్న పేరు మీద ఉన్నది. ధరణిలో వచ్చిన సమస్య వల్ల ఇంకా పట్టా పేరు మార్పు కాలేదు. అసలే పేదకుంటుంబం. ఆపై కూతురు పెండ్లి చేసి కొంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఆర్థిక కష్టాలన్నీ గట్టెక్కేందుకు నేలతల్లిని నమ్ముకున్నారు. తల్లిదండ్రుల వయసు రీత్యా బాధ్య తను కుమారుడు శశికుమార్(26) తన భుజాన వేసుకున్నాడు. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూనే, సాగు బాట పట్టాడు. తండ్రికి వారస త్వంగా వచ్చిన మూడెకరాలతో పాటు తన గ్రామం లోనే మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. నాలుగెకరాల్లో పత్తి, మరో నాలుగెకరాల్లో వరి వేశారు. కొడుకుకు సాయంగా తల్లిదండ్రులు కూడా పొలంబాట పట్టారు. పంటలు మంచిగ పండితే ఆర్థిక కష్టాలన్నీ తీరుతాయని కలలుగన్నారు. సాగుకు పెట్టుబడిని కొడుకు శశికుమారే వెళ్లదీస్తు న్నాడు. తనకు వచ్చే జీతంతో పాటు మరో రూ. 3ల క్షలు ప్రైవేటు అప్పు తీసుకొచ్చాడు. పురుగు మందులు, కూలీలు ఇతరత్ర అవసరాల కోసం తెలి సినవారి వద్ద చేబదులు తీసుకువచ్చాడు. పెట్టుబడి పేరుకుపోతూనే ఉంది. కానీ కాలం అనుకూలించ లేదు. పంటలకు సాగునీళ్లు కరువయ్యాయి. చీడపీ డలు ఆశించాయి. వేసిన రెండు పంటలూ చేతి రాకుండాపోయాయి. సాగుకు చేసిన అప్పులు గుర్తు కొస్తున్నాయి. చేబదులు ఇచ్చిన వారు లెక్కలు అడు గుతున్నారు. దిక్కుతోచనిస్థితిలో శశికుమార్ మార్చి 27న రాత్రి పురుగుమందు తాగాడు. 'అయ్యో కొడుకా... ఎంత పనిజేస్తివి' అంటూ కన్నీరు కార్చు కుంటూ తల్లిదండ్రులు అర్ధరాత్రి వేళ శశికుమార్‌ను స్థానిక దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమిం చిందని, ఖమ్మం తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు తే ల్చారు. అప్పటికప్పుడు మరికొంత అప్పు తీసు కొచ్చి ఖమ్మం తీసుకెళ్లారు. అయినా కొడుకు దక్కలే దు. వేసిన పంట, కన్న కొడుకు కండ్ల ముందే దూర మవడంతో రైతు కుటుంబం రోడ్డున పడింది.

కొడుకే మాకు ఆధారం..

మాది పేద కుటుంబం. వ్యవసాయం మీదపూ బతుకుతున్నాం. సాగు పను లన్నీ కొడుకే చూసుకుంటాడు. పాల్వంచలో ఒక ప్రైవేటు బిస్కెట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తూనే.. వచ్చిన జీతం కూడా పెట్టుబడికి పెట్టాడు. సాగు కోసం రూ. 3 లక్షలు వడ్డీకి తెచ్చిండు. మధ్యలో కొన్ని చేబదుళ్లు కూడా తెచ్చాడంట. ఇంతచే సినా పంట చేతికొచ్చేలా కన్పించట్లేదని తరచూ మాతో అంటుండేవాడు. భూ మాతను నమ్ముకున్న వాళ్లకు ఏమీ కాదని మేము ధైర్యం చెప్పేవాళ్లం. అప్పులు తీర్చే ఆలోచన కన్పించక ఎంత మధనప డ్డాడో ఏమో. తనువు చాలించి మాకు గుండె బరువు నింపాడు. ఆధారం కోల్పోయిన మా కుటుం బాన్ని సర్కారు ఆదుకోవాలి.

–మంత్రి శంకర్, శశికుమార్ తండ్రి, యానంబైలు.

లోకం పోకడ

ఆర్టీసీకి గుదిబండగా మారిన మహిళలకు 'ఫ్రీ' బస్సు ప్రయాణం!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.0°c	26.2°c
రంగారెడ్డి	39.5°c	21.1°c
నల్లగొండ	39.0°c	23.0°c
ఖమ్మం	39.0°c	24.0°c
మహబూబ్‌నగర్	37.8°c	26.4°c
వరంగల్	36.0°c	25.0°c
కరీంనగర్	34.0°c	26.0°c
హైదరాబాద్	33.8°c	26.2°c
మెదక్	33.3°c	21.9°c
నిజామాబాద్	33.02°c	25.5°c

జనగామ మార్కెట్‌లో కొలిక్కిరాని చర్చలు

- కేసులను తొలగించాలని వ్యాపారుల డిమాండ్
- ధాన్యం నాణ్యతగా ఉంటేనే కొంటామని వెల్లడి
- ఇప్పటివరకు ఈ-నామ్ ప్రకారమే కొన్నాం
- ఎంఎస్‌పీ ప్రకారం కొనుగోళ్లు సాధ్యపడదు
- ఇకపై అన్ని రకాల ధాన్యం కొనుగోళ్లు ఆపేస్తాం
- ట్రేడర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్ హెచ్చరిక

జనగామ రూరల్, ఏప్రిల్ 13 : మూడు రోజులుగా ధాన్యం ధర విషయంలో జనగామ వ్యవసాయ మార్కె ట్‌లో రైతులు, వ్యాపారులకు మధ్య జరుగుతున్న చర్చలు విఫలమయ్యాయి. ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ డీడీ రాజానాయక్ శనివారం జనగామ మార్కెట్‌కు చేరుకొని అధికారులతోపాటు ట్రేడర్లు, అడ్తిదారులతో చర్చలు జరి పారు. తమపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఉపసం హరించుకోవాలని, ఇప్పటివరకు మార్కెట్‌లో ఇ-నామ్ ప్రకారమే కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు సదరు అధికారి దృష్టికి తెచ్చారు. ఎండాకాలం కావడంతో అకాల వర్షాలు కురుస్తాయని, పంట చేతికి రాకముందే వరికో తలు కోస్తుండటంతో ధాన్యం పచ్చిగా ఉంటుందని, తాలు, గడ్డి వస్తుండటంతో ఈ-నామ్ ప్రకారం టెండర్ ద్వారా ధర ప్రకటించి వారు నిర్ణయించిన ధరకే కొను గోలు చేస్తున్నామని, ఇక్కడ ట్రేడర్లు, వ్యాపారుల సొంత నిర్ణయం లేదని వ్యాపారులు పేర్కొన్నారు. తక్కువ ధర వస్తుందని రైతులు చెబితే అధికారులు తమపై కేసులు పెట్ట డమేంటని సదరు అధికారిని నిలదీశారు. నాణ్యత ఉంటే సరుకు కొనుగోలు చేస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారం ఎంఎస్‌పీకి మార్కెట్‌లో కొనుగోళ్లు సాధ్యం కాదని స్పష్టం చేశారు. గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అందులోనే రైతులు తమ సరుకును అమ్ముకోవచ్చని సూచించారు. ట్రేడర్ల సంఘం అధ్యక్షుడు నాగబండి రవీందర్ మాట్లా డుతూ.. ఇప్పటి నుంచి మార్కెట్‌లో ఎలాంటి సరుకులు కొనుగోలు చేయబోమని మార్కెటింగ్ డీడీ రాజు నాయ క్‌కు తెలియజేశామని అన్నారు.

జగన్‌పై రాళ్ల దాడి

మొదటిపేజీ తరువాయి...

ప్రథమ చికిత్స చేశారు. జగన్‌పై రాళ్లదాడి జరిగిందని తెలిసిన వెంటనే వైసీపీ శ్రేణులు విజయవాడలో ఎక్కడికక్కడే ఆందోళ నలు చేపట్టారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే కఠి నంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విజయవాడ సిటీలోకి 'మే మంతా సిద్ధం' బస్సుయాత్ర రావడంతో జగన్‌ను చూసేందుకు జనం పోటెత్తారు. అప్రతిహతంగా కొనసాగుతున్న బస్సుయా త్రను, భారీగా వస్తున్న జనాన్ని చూసి ఓర్వలేకనే టీడీపీ వర్గాలు ఈ దాడికి పాల్పడ్డాయని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. దాడి జరిగిన ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరించిన వారి గురించి ఆరా తీస్తున్నారు. రాళ్ల దాడి జరిగినప్పటికీ.. ప్రాథమిక చికిత్స అనంతరం జగన్ తన బస్సుయాత్రను కొనసాగించారు.

బాధ్యులను వెంటనే శిక్షించాలి..

ఏపీ సీఎం జగన్‌పై జరిగిన దాడిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ఖండించారు. 'జగన్ అన్నా జాగ్రత్తలు తీసుకోండి. మీరు సురక్షితంగా ఉన్నారు సంతోషం. ఏపీ సీఎం జగన్మోహ న్‌రెడ్డిపై జరిగిన దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజా స్వామ్యంలో హింసకు స్థానం లేదు. ఎన్నికల సంఘం ద్వారా కఠినమైన చర్యలు చేపట్టాలని నేను ఆశిస్తున్నాను' అంటూ కేటీ ఆర్ ట్వీట్ చేశారు. ఇది హేయమైన చర్య అని, ప్రజాస్వా మ్యంలో హింసకు తావులేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఘట నకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. జగన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సైతం జగన్‌పై దాడిని ఖండించారు. రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదని పేర్కొ న్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు సభ్యత, పరస్పర గౌర వాన్ని కాపాడుకోవాలని సూచించారు. జగన్ సోదరి, ఏపీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిస్తూ.. రాళ్ల దాడిలో జగన్ గాయపడటం బాధాకరం, దురదృష్టకరమని అన్నారు. ఈ హింసను ప్రతి ప్రజాస్వామిక వాది ఖండించాలని కోరారు. జగన్‌పై దాడిని టీడీపీ అధినేత చంద్రబాబు ఖండించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.